క్లుప్తంగా

బ్యాట్ పట్టి...సిక్సులు కొట్టి...



నందిగామ: సంక్రాంతి పండుగ సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక రామలింగేశ్వర నగర్‌లో మూడు రోజులపాటు నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు ప్రారంభించారు. టోర్నమెంట్ ను ప్రారంభించిన ఆయన బ్యాటు పట్టి కొద్దిసేపు క్రికెట్ ఆడారు. ఆ సమయంలో ప్రతి బంతిని సిక్సులు కొడుతూ ఫీల్డర్లను పరుగులు పెట్టించి తాను డాక్టరే కాదు మంచి క్రికెట్ ప్లేయర్ అని కూడా నిరూపించుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ సతీష్, ఎస్‌ఐలు సురేష్, పండుదొర, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయానికి విరాళాలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి గురువారం మండలంలోని గుమ్మడిదుర్రు గ్రామానికి చెందిన బారు అచ్యుతరావు, సుధారాణి దంపతులు రూ.10 వేలు ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు చేతుల మీదుగా అందజేశారు. నూజివీడుకు చెందిన సాంబశివరావు, నాగమల్లేశ్వరి దంపతులు అమ్మవారికి 5 గ్రాముల 300 మిల్లీ గ్రాముల రెండు బంగారు ముగురులు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రంతో సత్కరించారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలం కొడవటికల్లు గ్రామంలో రూ.ఏడు లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న గ్రావెల్ రోడ్ల ఏర్పాటు పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగు నీటి కుళాయి కనెక్షన్‌లు, సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో పాటు అవసరమైన వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రవిబాబు, నాయకులు జంపాని నాగేశ్వరరావు, తెల్లమేకల నాగేశ్వరరావు, పిన్నబోయిన శ్రీనివాసరావు, రాచబంటి కోటేశ్వరరావు, వేగినేటి సుబ్బారావు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ రాజ్యాధికారంలో భాగస్వామ్యం

- మున్సిపల్ కౌన్సిల్‌లో కోఆప్షన్ సభ్యుని ఎన్నిక
- బ్రాహ్మణ వర్గానికి మొదటి సారిగా అవకాశం

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించడం ద్వారా సామాజిక న్యాయం పాటిస్తూ దేశ చరిత్రలోనే ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. స్థానిక కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో గురువారం చైర్మన్ రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో కోఆప్షన్ సభ్యుని ఎన్నిక జరిగింది. పురపాలనలో ప్రత్యేక పరిజ్ఞానం కలిగిన వ్యక్తుల కోటాలో కోఆప్షన్ సభ్యుని ఎన్నికకు ఒకే ఒక నామినేషన్ రావడంతో బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన అర్చకుడు మంగు సాయి చైతన్య శర్మ పేరును ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యునితో చైర్మన్ రాఘవేంద్ర ప్రమాణ స్వీకారం చేయించారు.



కోఆప్షన్ సభ్యుడు సాయిచైతన్య శర్మతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న చైర్మన్ రాఘవేంద్ర

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

పేట మున్సిపల్ చరిత్రలో బ్రాహ్మణులకు మొట్టమొదటి సారిగా కోఆప్షన్ సభ్యునిగా అవకాశం కల్పించినందుకు ముందుగా ప్రభుత్వ విప్ ఉదయభానుకు సాయి చైతన్య శర్మ కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ అభివృద్ధిలో తన వంతు కృషి చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఉదయభాను ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటానని తెలిపారు.

ప్రభుత్వ విప్ ఉదయభాను అభినందనలు

నూతనంగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యుడు సాయి చైతన్య శర్మకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు. పట్టణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పట్టణ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో జగ్గయ్యపేటను అన్ని రకాలుగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

కోఆప్షన్ సభ్యునికి సత్కారం

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా, 8 వ వార్డు సభ్యుడు సామినేని వెంకటకృష్ణప్రసాద్, కమిషనర్ శివకోటేశ్వరరావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని నూతన కోఆప్షన్ సభ్యునికి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు.

రంగుల మహోత్సవం విజయవంతం చేయాలి

ఆర్డీఓ రవీంద్రరావు

పెనుగంచిప్రోలు: అధికారులు సమన్వయంతో పనిచేసి శ్రీతిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల, కల్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆర్డీఓ ఎ.రవీంద్రరావు అన్నారు. ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు జరిగే పెద్ద తిరునాళ్లకు సంబంధించి గురువారం ఆలయ ఆవరణలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఉత్సవాల్లో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వటంతో పాటు తాగునీటికి అసౌకర్యం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఫిబ్రవరి 5న జరిగే అమ్మవారి కల్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో రానున్న సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. జగ్గయ్యపేట సీఐ నాగమురళి మాట్లాడుతూ ఉత్సవాలకు బందోబస్తును సెక్టారులుగా విభజించి భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. అధికారులు అందరూ సహకరించి విజయవంతం చేయాలన్నారు. ఈఓ డీవీఎస్ లీలాకుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 5న అమ్మవారి కల్యాణంతో పాటు దీక్షాస్వాముల తిరుముడి కార్యక్రమం ఉంటుందన్నారు. 6న జలబిందెల కార్యక్రమం, 7, 8 అంకమ్మవారికి క్రతువులు, 9న పూర్ణాహుతితో పెద్ద తిరునాళ్లు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్, ఆలయ ఈఈ వైకుంఠరావు, ఎస్‌ఐ హరిప్రసాద్, వైద్యాధికారి ఇందిర, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ పక్కన తహసీల్దార్, ఈఓ, చైర్మన్, సీఐ తదితరులు

పన్నులు సకాలంలో చెల్లించి ఆదాయాన్ని పెంచుదాం

కౌన్సిల్ అత్యవసర సమావేశంలో చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: పురపాలక సంఘ పరిధిలో ప్రతి ఒక్కరూ ఇంటి పన్నులు, కుళాయి పన్నులు సకాలంలో చెల్లించడం ద్వారా మున్సిపల్ ఆదాయాన్ని పెంచుదామని, తద్వారా పట్టణ అభివృద్ధికి కృషి చేద్దామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. గురువారం సాయంత్రం మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో చైర్మన్ రాఘవేంద్ర అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. సమావేశంలో వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ వేసవి రాకముందే హెడ్ వాటర్ వర్క్స్‌లో, పట్టణంలోని ప్రధాన పైపులైన్లలో రిపేర్లను గుర్తించి మరమ్మతులు చేయించాలని సూచించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి పాత పన్నుల బకాయిలు వసూలు చేసి ఆదాయాన్ని పెంచాలని, లేకుంటే జీతాలు చెల్లించే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. దీనిపై కమిషనర్‌తో చైర్మన్ వివరణ ఇప్పించారు. చెరువు అభివృద్ధి కోసం నీరు తోడించడం ద్వారా రైతులను ఇబ్బందులు పెట్టవద్దని ప్రతిపక్ష సభ్యురాలు కన్నెబోయిన రామలక్ష్మి చైర్మన్‌తో అన్నారు. దీనిపై పాలకవర్గ సభ్యుడు వట్టెం మనోహర్ మాట్లాడుతూ అభివృద్ధిని అడ్డుకోవడమే ప్రతిపక్షం అజెండా అని, ఆటంకాలు కల్పించడం మాని సలహాలు ఇస్తే బావుంటుందన్నారు. పారిశుద్ధ్యం విషయంలో ఓపెన్ డ్రైయిన్ల వలన దుర్వాసన రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని 8 వ వార్డు కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. నిధుల కొరత ఉంటే పట్టణ సమీపంలో ఉన్న అనేక ఫ్యాక్టరీల సహకారంతో సీఎస్ఆర్ నిధులతో పట్టణాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని సూచించారు. సమావేశంలో వైస్ చైర్మన్ హఫీజున్నీసా, సభ్యులు నూకల సాంబ, గింజుపల్లి వెంకట్రావు, సుందరమ్మ, ఖాదర్‌బాబు, పందుల రోశయ్య, కాశి అనురాధ, వెంకట్, సైదేశ్వరరావు, గీతారాణి, అలేఖ్య తదితరులు పలు సమస్యలను ప్రస్తావించారు. అనంతరం అజెండాలోని 34 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. కమిషనర్ శివకోటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో చోరీ

పెద్దాపురం(వీరులపాడు): మండలంలోని పెద్దాపురం గ్రామంలో ఉన్న రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని ఎస్‌ఐ సోమేశ్వరరావు తెలిపారు. ఆలయ అర్చకులు బుధవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయానికి తాళాలు వేశారని, అర్ధరాత్రి 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి ఆలయ గేటు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారన్నారు. ఈ చోరీలో ఆరు మంగళ సూత్రాలు, 400 గ్రాముల వెండి వస్తువులు, హుండీలోని సుమారు రూ.10 వేల నగదు అపహరించారన్నారు. ఆలయ పర్యవేక్షకుడు చెరుకూరు రామారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు అల్లూరుకు మంత్రుల రాక

వీరులపాడు: కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మార్కెట్ యార్డు చైర్మన్‌గా కోటేరు మల్లేశ్వరి, వైస్ చైర్మన్‌గా మాడుగుల శంకర్‌రావులతో పాటు డైరెక్టర్ల ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుందని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి వీరులపాడు మండలం అల్లూరు గ్రామంలోని సన్‌రైజ్ పాఠశాలలో ముగ్గుల పోటీలు జరుగుతాయన్నారు. ఐదు గంటలకు అల్లూరులో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలలో మంత్రులు ఆర్‌కే రోజా, జోగి రమేష్‌తో పాటు శాసన సభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పాల్గొంటారని తెలిపారు.

పోటీలు క్రీడా స్ఫూర్తితో సాగాలి

వీరులపాడు: పోటీలు క్రీడా స్ఫూర్తితో సాగాలని నందిగామ రూరల్ సీఐ నాగేంద్రకుమార్ అన్నారు. మండలంలోని జమ్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగల పేరుతో యువత అసాంఘిక క్రీడలకు పాల్పడకుండా సంప్రదాయ క్రీడలపై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, నాయకులు నల్లబోయిన తిరుమలరావు, యాదాల దాసు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్: సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం స్థానిక ఆర్టీసీ గ్రౌండ్స్‌లో పోలీసుల ఆధ్వర్యంలో జరిగే షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఎస్‌ఐ బీవీ.రామారావుతో కలిసి సీఐ ఎ.నాగమురళి ప్రారంభించారు. చిల్లకల్లు ఎస్‌ఐ చినబాబు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

కంచికచర్ల: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండల కేంద్రమైన కంచికచర్ల ఆరవ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, ఎంపీటీసీ సభ్యుడు మాడుగుల మధుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు దేవరపల్లి గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, వంగా శ్రీనివాసరావు, లగడపాటి నాగేశ్వరరావు, వేల్పుల రమేష్, వేల్పుల శ్రీనివాస్, మార్త శ్రీనివాస్ పాల్గొన్నారు.



కంచికచర్లలో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

సంక్షిప్తం

అరుంధతీ నగర్ వాసులకు తొలగిన తాగునీటి కష్టాలు



కంచికచర్ల: కంచికచర్ల అరుంధతీ నగర్‌లో 15వ ఆర్థిక సంఘ నిధులతో నూతనంగా ఏర్పాటుచేసిన ప్రధాన తాగునీటి పైప్‌లైన్‌ను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు ప్రారంభించి తాగునీటిని విడుదల చేశారు. 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.26లక్షలతో పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి చేసి తాగు నీరు సరఫరా చేశామన్నారు. అనంతరం తమ తాగునీటి కష్టాలు తీర్చినందుకు అరుంధతీ నగర్‌వాసులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, ఉప సర్పంచి వేమా సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు మాడుగుల మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు చందర్లపాడులో కబడ్డీ పోటీలు

నందిగామ(చందర్లపాడు): ఈ నెల 14న చందర్లపాడు ఎస్సీ కాలనీలో రామనరసింహం స్మారక నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ ప్రారంభిస్తారన్నారు. ప్రథమ విజేతకు రూ.10,116, ద్వితీయ విజేతకు రూ.7,116, తృతీయ విజేతకు రూ.3,116, చతుర్థ స్థానం సాధించిన వారికి రూ.2,116 వంతున నగదు బహుమతి అందిస్తామని, ఆసక్తి కలిగిన జట్లు పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి వేడుకలు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో గురువారం 14, 23 వార్డుల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యురాలు బొజ్జా సౌమ్య అతిథిగా పాల్గొని భోగి పళ్లతో చిన్నారులను ఆశీర్వదించారు. స్థానిక బాలబాలికలు వేసిన రంగవల్లులు చూసి బహుమతులు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీ ఫణి కుమారి, హసీనా, అనంత లక్ష్మి, నర్సమ్మ, పిల్లల తల్లిదండ్రులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

చిల్లకల్లులో పోలీసుల ఆధ్వర్యంలో పోటీలు

బలుసుపాడు(జగ్గయ్యపేట): సంక్రాంతి పండుగ సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చిల్లకల్లు ఎంపీయూపీ పాఠశాలలో గురువారం సంక్రాంతి పోటీలు నిర్వహించారు. ముగ్గులు, కుర్చీలాట, గోనె సంచి పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చిల్లకల్లు ఎస్‌ఐ చిన్నబాబు, సర్పంచ్ యడ్లపల్లి సూర్యప్రకాశరావు, గ్రామ పెద్దలు ప్రభాకర్, బాలసైద, మహిళా పోలీస్ జయశ్రీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేకు డ్రోన్లతో ట్రయల్ రన్



నందిగామ: భూముల రీ సర్వే కోసం వినియోగించే డ్రోన్లకు నందిగామ పట్టణ పరిధిలోని పంట పొలాల సమీపంలో గురువారం ట్రయల్ రన్ నిర్వహించారు. డ్రోన్ల కంపెనీకి చెందిన ప్రతినిధులు వాటిని వినియోగించే విధానం, పని తీరుపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవీంద్రరావు, డివిజనల్ సర్వే అధికారులు రవీంద్ర ప్రసాద్, జగన్ మోహనరావు, మండల సర్వేయర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

కంచికచర్ల: గ్రామాల్లో సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోళ్లకు కత్తులు కట్టి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మండలంలోని గండేపల్లి చెరువుకట్ట సమీపంలో కోడి పందేలు నిర్వహించేందుకు చేసిన ఏర్పాట్లను గుర్తించి గురువారం వాటిని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ శిబిరాలు నిర్వహించి పేకాట, గుండాట ఆడితే చర్యలు తీసుకుంటామన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

కంచికచర్ల: మండలంలోని పరిటాల ముత్తవరపు వెంకటేశ్వరరావు ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థినులు కళాశాలలో రంగు రంగుల రంగవల్లులు వేశారు. కోలాట ప్రదర్శన చేశారు. పొంగళ్లు, పాయసం వండారు. అనంతరం భోగిమంటలు వేసి, సంక్రాంతి పాటలు పాడారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ యు.ఏడుకొండలు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎ.రామకృష్ణ పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తిప్రదాత స్వామి వివేకానంద

జగ్గయ్యపేట అర్బన్: యువతకు స్ఫూర్తిప్రదాత స్వామి వివేకానంద అని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. స్వామి వివేకానంద జయంతి వేడుకలు పట్టణంలో గురువారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న వివేకానంద విగ్రహానికి చైర్మన్ రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు పచ్చిపాల నాగేశ్వరరావు, యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

యువతకు వివేకానందుడు ఆదర్శం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): చిల్లకల్లులో విశ్వభారతి కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చేపట్టిన శిబిరంలో భాగంగా ఎంఈఓ రవీందర్ వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, కరస్పాండెంట్ పద్మాశేఖర్, ప్రోగ్రాం అధికారి తిరుపతిరావు పాల్గొన్నారు.